# నిస్సీ జయధ్వజము

విడి పత్రిక రూ 8/-

మార్చి - 2016 | క్రైస్తవ ఆధ్యాత్మిక మాస పత్రిక | సంవత్సరపు చందా రూ. 100/-


# తెర చినిగెను

**"సంవత్సరమునకు ఒక్కసారిమాత్రమే ప్రధానయాజకుడొక్కడే రక్తముచేత పట్టుకొని రెండవ గుడారములోనికి ప్రవేశించును. ఆ రక్తము తనకొరకును ప్రజల అజ్ఞానకృతముల కొరకును అతడర్పించును. దీనినిబట్టి ఆ మొదటి గుడారమింక నిలుచుండగా అతి పరిశుద్ధస్థలములో ప్రవేశించు మార్గము బయలుపరచబడలేదని పరిశుద్ధాత్మ తెలియజేయుచున్నాడు". హెబ్రీ 9:7-8**

పైన వ్రాయబడిన రెండువచనాలు ఇవిచాలా అద్భుతమైన మాటలు. వాటిని దేవుడు పరిశుద్ధగ్రంథంలో వ్రాసి ఉంచాడు. ఈ మాటలను ఇప్పుడు మనం ధ్యానించుదాం. పాతనిబంధనకాలములో దేవుడు తనకొరకు యాజకులను నియమించుకున్నాడు. వారు ప్రత్యక్షపుగుడారమనే మందిరములో సేవ చేయాలి. ఆ దినాలలో మందిరానికి బెతెస్థ ప్రార్థన మందిరమని, బాప్టీస్టు ప్రార్థన మందిరమని, పెంతెకొస్తు ప్రార్థన మందిరమని, హెబ్రోను ప్రార్థనమందిరమని పేర్లులేవు. ఆ దినాలలో ప్రత్యక్షపు గుడారమనే మందిరము ఒక్కటే ఉండేది. ప్రత్యక్షగుడారము అనగా దేవుడు ప్రత్యక్షమయ్యే గుడారము, దేవుడు దర్శనమిచ్చే గుడారం. ఆ దినాలలో వందలాది ప్రార్థనా మందిరాలులేవు ప్రజలందరికి ఒకే ప్రార్థనామందిరం. లక్షలమందికి ఒకే ఒక్క సేవకుడు అతనిపేరు అహరోను. లక్షలమందికి ఒకేఒక్క నాయకుడు అతనిపేరు మోషే. దాదాపు 40లక్షలమంది ప్రజలు ఉంటారు. ఒకపట్టణంలో 2లక్షలమంది ప్రజలు ఉన్నారుఅని అనుకుంటే అటువంటివి 20 పట్టణాలు అవుతాయి. ఈ 20పట్టణాల

ప్రజలకు ఒకే ప్రార్థనామందిరం. కాని ఈరోజు 20మందికి ఒకప్రార్థనామందిరము, ఒకే పట్టణములో 50 ప్రార్థనామందిరాలు, ఆ ప్రార్థనామందిరాలలో రకరకాల బోధలు, రకరకాల ఆరాధనలు, రకరకాల క్రమాలు ఉన్నాయి. సంఘాల్లో ఐక్యత కరువై రాజకీయాలతో సంఘాలు ముడిపడిఉన్నాయి. కాని ఆదినాలలో లక్షలమందికి ఒకే మందిరము, ఒకే యాజకుడు, ఒకే నాయకుడు. ఈ ప్రత్యక్షపుగుడారములో యాజకత్వాన్ని, సేవాకార్యక్రమాలను దైవజనుడు ప్రధానయాజకుడు అహరోను నడిపించెవాడు. ఇతనికి కొన్ని ఆజ్ఞలు ఇవ్వబడ్డాయి. ఆ ఆజ్ఞలప్రకారంగా ఇతను యాజకత్వాన్ని చేయాలి. తనకు తోచినట్లుగా కాకుండా దేవుడు చెప్పిన రీతిగా ఇతడు ప్రత్యక్షగుడారంలో సేవజరిగించాలి.

ప్రత్యక్షగుడారమనే మందిరములో మూడు భాగాలున్నాయి మొదటిది ఆవరణం రెండవది పరిశుద్ధస్థలం మూడవది అతిపరిశుద్ధస్థలం. ప్రధానయాజకుడైన అహరోను ఆవరణములో పరిశుద్ధ స్థలములో ప్రతిరోజు తిరుగుతూ సేవా కార్యక్రామాలను జరిగిస్తూ ఉంటాడు. ఎందుకంటే ఆవరణంలో గంగాళం, బలిపీఠం ఉంటాయి. బలిపీఠంమీద బలి అర్పించాలి. గంగాళం ఉంటుంది. గంగాళంలో చేతులను కడుగుకోవాలి, పరిశుద్ద స్థలములో దీపవృక్షం ఉంటుంది. దానిలో ప్రతిరోజు నూనేపోసి దీపాలను వెళిగించాలి. అదే పరిశుద్దస్థలములో సముఖపురొట్టెలబల్ల ఉంది. ఈ బల్లమీద 12 రొట్టెలు ఉంటాయి. ఈ రొట్టెలను వారానికి ఒకసారి మార్చాలి. వెచ్చనిరొట్టెలను సముఖపుబల్లమీద పెట్టాలి. 11 కాని 13 రొట్టెలు పెట్టడానికి వీలులేదు. బల్లమీద 12 రొట్టెలు మాత్రమే పెట్టాలి. పన్నెండు అనే సంఖ్యకు అర్థం ఉన్నది. పరలోకానికి 12 పునాదులు ఉన్నాయి. పరలోకానికి 12 తలుపులు ఉన్నాయి. యేసుప్రభువుకు 12 మంది శిష్యులు ఉన్నారు. ఇలా పన్నెండు అనే సంఖ్య ప్రాముఖ్యమైన సంఖ్య. ఈ పన్నెండు రొట్టెలను రెండువరుసలలో పేర్చాలి. వారానికి ఒకసారి మార్చాలి. వేడిరొట్టెలను బల్లమీదపెట్టి పాతరొట్టెలను యాజకుడు మాత్రమే తినాలి. మరెవరూ తినకూడదు. రొట్టె అనగా దేవుని వాక్యం. ప్రతివారం రొట్టెలు ఎలా మారుస్తారో గడచినవారం బోధించిన ప్రసంగం మళ్ళీ ఈ వారం బోధించకూడదు. పోయిన ఆదివారం దేవుడు ఇచ్చిన ప్రకటన, ఈ ఆదివారం ఇచ్చే ప్రకటన వేరుగా ఉంటుంది. రొట్టెలు మారుతున్నట్లుగా దేవుని వర్తమానం మారాలి. ప్రతి ఆదివారం నూతన ప్రకటన దేవునియొద్దనుండి సేవకుడు పొందుకొని నూతన ప్రత్యక్షతను ప్రజలకు అందించాలి. తర్వాత పరిశుద్ధస్థలములో దూపవేధిక ఉంటుంది. ప్రతిరోజు రావాలి ధూపంవేయాలి. దీపాలు వెలిగించాలి. రొట్టెలు వారానికి ఒకసారి మార్చాలి.

ఈ కార్యాక్రమాలన్ని ప్రతిరోజు ప్రధానయాజకుడు చేయాలి. ఈ కార్యాక్రమాలన్ని సంవత్సరానికి 365 రోజులు చేస్తున్నాడు. ప్రతిరోజు సేవచేస్తున్నాడు కాని ఈ అతిపరిశుద్దస్థలానికి రావడంలేదు. కారణమేమిటంటే ఈ అతిపరిశుద్ధస్థలములో నిబంధన మందసం ఉంది.

అతిపరిశుద్ధస్థలానికి పరిశుద్ధస్థలానికి మధ్యలో అడ్డతెర ఉంది. దేవుడు నీవు రోజు ఆవరణములో మరియు పరిశుద్ధస్థలములో సేవచేయవచ్చుకాని సంవత్సరానికి ఒక్కసారిమాత్రమే అతిపరిశుద్ధ స్థలములోనికి రావాలని అజ్ఞాపించాడు. అతిపరిశుద్ధ స్థలములోనికి వచ్చేటప్పుడు కూడ నడుముకు తాడు కట్టుకొని ఆతాడును ఆవరణం బయట వదిలిపెట్టి రావాలి ఎందుకంటే ఒకవేళ సరియైన క్రమంలో లోనికి రాకపోతే లోపల అడుగువేసి అడుగువేయకముందే ప్రధానయాజకుడు మరణిస్తాడు. ఎందుకంటే అక్కడ దేవుడు ఉన్నాడు. దేవుడు నివసిస్తున్నాడు. దేవుని ప్రసన్నత, మహిమ ఆ స్థలములో ఉంది గనుక ఈ స్థలానికి సంవత్సరంలో ఒక్కసారిమాత్రమే రావాలి. సరిగ్గాప్రార్థన చేసుకొని, శుద్ధీకరించుకొని రావాలి. ఒకవేళ సరియైన క్రమంలో రానియెడల అతను మరణిస్తే అతని శవాన్ని తీయడానికి కూడ ఎవరు లోనికి వెళ్ళకూడదు. బయటతాడు ఉంటుంది ఆ తాడుతోనే శవాన్ని బయటకు లాగాలి. అందుకే అనాలోచితంగా రాకూడదు. సంవత్సరానికి ఒక్కసారే రావాలి . వచ్చేటప్పుడు ఒక నిర్దోషమైన గొఱ్ఱెపిల్లయొక్క రక్తాన్ని పాత్రలో పట్టుకొని రావాలి. ఈ మందసం చుట్టూ తిరుగుతూ గొఱ్ఱెపిల్లయొక్క రక్తాన్ని ప్రోక్షించాలి. ఎందుకు ఈ రక్తాన్ని ప్రోక్షించాలంటే ఇశ్రాయేలీయులు చేసిన పాపాలన్నిటి నిమిత్తం ఒక గొఱ్ఱెపిల్ల వధించబడింది. దానిరక్తాన్ని అతిపరిశుద్ధ స్థలములో ప్రోక్షించాలి. ప్రోక్షించిన తర్వాత బయటకురావాలి. మళ్ళీ 365 దినాల తర్వాత మాత్రమే లోనికి రావాలి. అందుకే **"దీనినిబట్టి ఆ మొదటి గుడారమింక నిలుచుండగా అతి పరిశుద్ధస్థలములో ప్రవేశించు మార్గము బయలుపరచబడలేదని పరిశుద్ధాత్మ తెలియజేయుచున్నాడు". హెబ్రీ 9:8"**

దీనిని బట్టి అతి పరిశుద్ధ స్థలానికి వెళ్ళేమార్గము బయలుపరచబడలేదు. అతిపరిశుద్ధస్థలములోనికి రాకుండా ఒక అడ్డుతెర అడ్డంగా ఉన్నది. దేవుడే ఈ అడ్డుతెరను అడ్డుగా ఉంచాడు.

**"యేసు మనకొరకు ప్రతిష్ఠించిన మార్గమున , అనగా నూతనమైనదియు, జీవముగలదియు, ఆయన శరీరము అను తెర ద్వారా యేర్పరచబడినదియునైన మార్గమున, ఆయన రక్తమువలన పరిశుద్ధస్థలమునందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది" హెబ్రీ 10:19**

అతిపరిశుద్ధస్థలానికి పరిశుద్ధస్థలానికి మధ్యలో ఉన్న అడ్డుతెరను యేసుప్రభువు తన సిలువత్యాగము ద్వారా చింపివేసాడు. తెర చినిగిపోయింది. ఇప్పుడు **"అంతట యేసు గొప్ప కేకవేసి ప్రాణము విడిచెను. అప్పుడు దేవాలయపు తెర పైనుండి క్రిందివరకు రెండుగా చినిగెను. మార్కు 15:37"** పరిశుద్ధస్థలానికి అతిపరిశుద్ధస్థలానికి మధ్యలో అడ్డుతెర లేదు. ఈ అడ్డుతెరను అహరోను ఎందుకు చీల్చలేదు? అహరోను దేవుడు కాదు అతను ఒక మనిషి. ఇతను పరలోకంనుండి పంపబడిన దేవునికుమారుడు కాదు. అతనితో ఈ కార్యం జరగడం అసాధ్యం. అందుకే అతను అందరు చనిపోయినట్టుగానే ఇతను చనిపోయాడు. ఈ తెరను చింపడానికి దేవుడే దిగిరావలసి

వచ్చింది. దేవునికిని ప్రజలకును మధ్యలో అడ్డుగా ఉన్న అడ్డతెరను చింపినవాడు యేసుప్రభువు. కొన్ని వందలవేల సంవత్సరాలుగా ప్రత్యక్షగుడారములో ఉన్న అడ్డతెరను. యేసుప్రభువు ఎందుకు చింపావు? అని యేసయ్యను అడిగితే ప్రభువు చెప్పేజవాబు మీరందరు చీల్చబడిన ఈ తెరద్వార మార్గము ద్వారా నా తండ్రియొద్దకు రావడానికి దీనిని చింపాను. మీరు తండ్రియొద్దకు చేరి తండ్రియొద్దనున్న ఆశీర్వాదాలను ఆనందాన్ని పొందడానికి ఈ అడ్డుగా ఉన్న తెరను చీల్చాను అంటాడు యేసుప్రభువు.

ప్రభువు తండ్రికిని మనకును మధ్యలో ఉన్న అడ్డుతెరను తన శరీరము అనే తెరను చీల్చడం ద్వారా ఒక మార్గాన్ని ఏర్పాటు చేసాడు. అంతకు మునుపు మార్గంలేదు. తండ్రియొద్దకు వెళ్లడానికి మనిషికి మార్గంలేదు. మార్గం లేని సమయంలో యేసుప్రభువు 2016 సం॥క్రితం భూమిమీదకి వచ్చి దేవునికిని మనకును  మధ్యలో ఒక మార్గాన్ని వేసాడు. “నేనే మార్గమును, సత్యమును, జీవమునైయున్నానని” యోహాను సువార్తలో వ్రాసాడు. దేవుని యొద్దకు వెళ్లడానికి మార్గాన్ని సరాళం చేసింది అహరోనా? లేదా యేసుప్రభువా? యేసుప్రభువే మార్గాన్ని తెరిచాడు. ఎలా మార్గాన్ని తెరిచాడు? ఆయన రక్తన్ని ప్రోక్షించుటద్వార మార్గాన్ని తెరిచాడు. అందుకే హెబ్రి 10.19 లో

**మొదటగా ఈ మార్గం ప్రతిష్ఠితమార్గము**.**“యేసు మనకొరకు ప్రతిష్టించిన మార్గమున , అనగా నూతనమైనదియు, జీవముగలదియు, ఆయన శరీరముఅను తెర ద్వారా యేర్పరచబడినదియునైన మార్గమున, ఆయన రక్తమువలన పరిశుద్ధస్థలమునందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది”**

**హెబ్రి 10:19**

పరలోకానికి దారివేసింది యేసుప్రభువు. మనకు మార్గాన్ని తెరచి మనకు గమ్యాన్ని చూపించినవాడు యేసుప్రభువు. యేసుమనకొరకు ఒకమార్గాన్ని వేసాడు. ఈ ప్రతిష్టించిన మార్గంలోనే యేసుప్రభువు వెళ్లి తండ్రి కుడిపార్శ్వమున కూర్చున్నాడు.

దేవుడు నివసించే స్థలము సీయోను. ఆ సీయోనులో వున్న సింహసనానికి అన్ని వైపులా కెరూబులు, సెరాపులు, ఆయనముందు కోటానుకోట్ల దేవదూతలు నిలబడియుండి వాయిధ్యాలు వాయిస్తూ, 24మంది పెద్దలు ఆయనముందు నిలబడియుండగా వారికిరీటములు తండ్రిపాదములపై పెట్టి నిత్యం పరిశుద్దుడు, పరిశుద్ధుడని గానప్రతిగానములు చేస్తున్నారు. దేవుడు సింహాసనమునందు ఆసీనుడైయున్నాడు. తండ్రియైన దేవుని యొక్క కుడిపార్శ్వమున ప్రభువు కూర్చున్నాడు. కూర్చోని విజ్ఞాపణ చేస్తున్నాడు. ప్రభువు ప్రతిష్టించుకొని ప్రతిష్టకలిగిన సేవచేసి ప్రతిష్టకలిగిన మార్గాన్ని వేసాడు. ఆ మార్గాన్ని హెబ్రిగ్రంథ కర్త ప్రతిష్టితమైన మార్గమని మాట్లాడుతూ ఉన్నాడు. ఈ మార్గముద్వారానే ఎవరైనా తండ్రియొద్దకు రావాలి. ఈ మార్గంలో నడిచేవారు సేవకుడైనా విశ్వాసియైనా ప్రతిష్టించుకోవాలి. ఈత్రోవలో ఎవరు

వెళ్ళాలన్నా ప్రతిష్టించుకొని వెళ్లాలి. ఈ ప్రతిష్టను గురించిన విషయాలు పూర్తిగా తెలుసుకొని పరిపూర్ణంగా ప్రతిష్టించుకోవాలి. ప్రతిష్టలో కొద్దిగా ప్రతిష్టించుకోవడం, కొన్నిరోజులు ప్రతిష్టించుకోవడం కుదరదు. ప్రతిష్ట పరిపూర్ణంగా ఉన్నప్పుడే నీకు మార్గంకూడా సంపూర్ణంగా తెరువబడుతుంది. అప్పుడు సింహాసనముయొద్దకు నీవు చేరగలుగుతావు.

క్రొత్తనిబంధన విశ్వాసియైనా, సేవకుడైనా ఈ ప్రతిష్టను తప్పక పాటించవలసిందే. ఈప్రతిష్టకలిగిన త్రోవకాకుండా ఇంకొక మార్గముకూడ ఉంది. అది ఏమిటంటే వేరొకద్వారము లేక వేరొక మార్గము. ఈ మార్గములో దొంగలు ప్రవేశిస్తారు. **"గొఱ్ఱెల దొడ్డిలో ద్వారమున ప్రవేశింపక వేరొక ద్వారమున ఎక్కువాడు దొంగయుదోచుకొను వాడునైయున్నాడు" యోహాను 10:1** పరలోకరాజ్యానికి వెళ్ళడానికి యేసుప్రభువు వేసిన ప్రతిష్టకలిగిన మార్గముతప్ప వేరొక మార్గము లేదు. కాని వేరొక మార్గమున్నది అది దొంగమార్గము. ఈ దొంగ మార్గాలలో నడిచేవారు అంటారు సినీమాలు చూడవచ్చు, ఇద్దరు భార్యలను పెండ్లి చేసుకోవచ్చు, భూతులు మాట్లాడవచ్చు క్రిస్మస్‌కు త్రాగవచ్చు లోకమర్యాదను ఆచార సాంప్రదాయాలు పాటించవచ్చు, ఇవి తప్పేమికాదని అంటారు. కొంతమంది మరియమ్మే దేవుడని అంటున్నారు. కొంతమంది మనుష్యులనే దైవంతో సమానులని అంటున్నారు. ఇక్కడ దేవున్ని మ్రొక్కడం తక్కువైపోయింది. మనుషులను మ్రొక్కడం ఎక్కువైంది. ఎవరైనా సేవకులు చనిపోయిన వారిని లేపారనుకోండి అంతే అతనే దేవుడైపోతాడు. ఈ దినాలలో చాలామంది సేవకులు ఆరాధించబడుతున్నారు. చేసింది అద్భుతం దేవుడైతే చూపించుకునేదంతా మనుష్యులు. ఈరోజు టీ.విలలో కన్పించేదంతా ఇదే. టీ.విలలో వాక్యం కన్పించదు. టీ.విలలో ఉపదేశం కన్పించదు ప్రతిష్టకలిగిన సేవదర్శనం కన్పించదు. ఉన్నతమైన ప్రత్యక్షతలు కన్పించవు. కన్పించేదంతా స్వస్థతలు క్రిందపడ్డవారిని 10సార్లు వీడియో రిపీట్ చేసి చూపడం ఇవే కన్పిస్తాయి. దయ్యాలు వెళ్లిపోయే కార్యక్రమాలు చాలా కన్పిస్తాయి కాని వాక్యం, ఉపదేశం చెప్పి విశ్వాసులను బలపరచి రాకడకు సిద్దపరిచేవారు కన్పిస్తారా? లేదు. 10 నిమిషాలు వాక్యం బోధించి 20 నిమిషాలు అద్భుతాలు చూపించడం ఇదే కన్పిస్తుంది.

ప్రియమైన దైవజనాంగమా! ఇది ఏమార్గము? ఇది వేరొకమార్గము. ప్రతిష్టకలిగిన మార్గం కాదు. ప్రతిష్టించబడిన మార్గంలో సేవకుడు ప్రతిష్టించుకోవాలి. పరలోకం వెళ్ళాలంటే ప్రతిష్టకలిగిన మార్గంలోనే వెళ్ళాలి. అడ్డదారులను పట్టకూడదు. సేవకుడైన, సంఘమైనప్రతిష్టించుకొని ఈ ప్రతిష్టకలిగిన మార్గంలోకి రావాలి. నీ జీవితాన్ని ప్రతిష్టించుకోవాలి, నీ నేత్రాలను ప్రతిష్టించుకోవాలి, నీ పెదవులను ప్రతిష్టించుకోవాలి, చెవులను ప్రతిష్టించుకోవాలి. నీ ముఖమును, వెంట్రుకలను, శరీరమును, నీ చేతులు, కాళ్లు, నీ హృదయము, సర్వఅవయవాలు, ప్రాణాత్మ దేహము ప్రతిష్టించుకోవాలి. ప్రతిష్టలేకుండా ఈ మార్గంలో నీవు నడవలేవు. నిత్యజీవాన్ని పొందలేవు.

**రెండవదిగా ఇది రాజమార్గము** అని పరిశుద్ధగ్రంథము తెలియజేస్తుంది. **"అక్కడ దారిగా నున్న రాజమార్గము ఏర్పడును అది పరిశుద్ధ మార్గమనబడును అది అపవిత్రులు పోకూడని మార్గము అది మార్గమున పోవువారికి ఏర్పరచబడును మూఢులైనను దానిలో నడచుచు త్రోవను తప్పక యుందురు. యెషయా 35:8** దైవజనుడైన అపో॥పేతురు మీరు రాజులైన యాజకసమూహము దేవుని సొత్తయిన ప్రజలు అని పత్రికలో వ్రాస్తున్నాడు. రాజులు ఎలా ఉంటారో దేవునిప్రజలు అలా ఉండాలి. ఎందుకు? నీవు పరలోకపు రాజకుమారునివి. ఈ లోకములో రాజులు నడిచేమార్గాన్ని రాజమార్గము అంటారు. మనప్రభువు రాజులకు రాజు గనుక ఆయన బిడ్డలమైన మనము మన గుణలక్షణాలు కార్యాలు నడవడి అంతాకూడా ఆవిధంగానే ఉండాలి. ప్రభువును నమ్ముకొని దరిద్రులుగా భిక్షగాళ్ళుగా అల్లరిచిల్లరగా బ్రతకకూడదూ. రాజు ఎలా ఠీవిగా ఉంటాడో ఈ లోకములో నీవుకూడా ఠీవిగా బ్రతకాలి. రాజు మాటలు చిల్లరగా ఉండవు. నీ మాటలు చిల్లరగా ఉండకూడదు. రాజు ఎవరుపడితే వారితో సహవాసం చేయడు. నీవు కూడా ఎవరుపడితే వారితో సహవాసం చేయకూడదు. నీ మనస్సులో ఎప్పుడు పరమరారాజు కుమారుడను, కుమార్తెనన్న ఆలోచన, తలంపు మెదలుతూ ఉండాలి. నీ కార్యాలు కూడా అలానే ఉండాలి. కారణం నీవు నడిచే మార్గం ప్రభువు వేసిన రాజమార్గము. ఈ రాజమార్గములో అల్లరిచిల్లరగా ఉండడానికి వీలులేదు.

**మూడవదిగా ఈ మార్గం పరిశుద్ధమార్గము**. ఈ మార్గములో అపవిత్రులు వెళ్లడానికి వీలులేదు. **"నేను పరిశుద్ధుడనైయున్నాను గనుక మీరును పరిశుద్ధులైయుండుడి" 1 పేతురు 1:14.** ప్రభువు పరిశుద్ధుడు గనుక ప్రభువు వేసినమార్గము పరిశుద్ధమైనది. గనుక నీ జీవితములో పరిశుద్ధతకు అధికంగా ప్రాముఖ్యతను ఇవ్వాలి. ప్రాణాత్మశరీరము ప్రభువు రాకడలో ఎత్తబడాలంటే పరిశుద్ధత చాలా అవసరం. ఆ పరిశుద్ధతే ఈ మట్టి శరీరాన్ని రూపాంతరములోనికి నడిపిస్తుంది. ఈరోజు నీ జీవితాన్ని అపవిత్రం చేసుకున్నావా? నీ మాటలతో అపవిత్రమైనావా? నీ తలంపులతో అపవిత్రమైనావా? నీ దేహముతో అపవిత్రమైనావా? అపవిత్రులు ప్రవేశింపలేని మార్గమది. కొంతమంది అపవిత్రంగానే ఉండి యేము ప్రతిష్టకలిగిన మార్గములో వెళ్తున్నాము అనుకుంటారు. కాని వారు వెళ్లేది వేరొక మార్గము. ఆ మార్గము పాతాళానికి నడిపిస్తుందనే సంగతి వారికి తెలియదు. మేము మందిరానికి వెళ్తున్నాము, దశమభాగాలను ఇస్తున్నాము, దేవుని పరిచర్యలో పాల్గొంటున్నాము. లోకంలో తిరిగినా మాకేమి కావడంలేదు అనుకుంటూ భక్తిచేస్తు వెళ్ళిపోతున్నవారంతా వేరొక మార్గానికి వెళ్తున్నారు.ఆమార్గం నేరుగా పాతాళానికి నడిపిస్తుంది. పాతనిబంధన భక్తుడైన యోసేపు పరిశుద్ధతను ఎంతో ప్రేమించాడు. అదేవిధంగా దానియేలు పరిశుద్ధతను ఎంతో ప్రేమించాడు. అందుకేవారు దీవించబడినారు. క్రీస్తురక్తంలో కడుగబడిన ప్రతి విశ్వాసి పరిశుద్ధతను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఎల్లవేళలా పరిశుద్ధంగా ఉండడానికి ప్రయాసపడాలి.

**నాలుగవదిగా ఈ మార్గము రక్షణమార్గము.** **"ఆమె పౌలును మమ్మును వెంబడించిన**

**ఈ మనుష్యులు సర్వోన్నతుడైన దేవుని దాసులు, వీరు మీకు రక్షణ మార్గము ప్రచురించువారైయున్నారని కేకలు వేసి చెప్పెను".అపో.కా16 :17**

పుతోను దయ్యం పట్టిన ఈ అమ్మాయి అక్కడ దేవుని దాసులు సువార్త ప్రకటించడానికి వెళ్తే వారు వెళ్తుండగా వెనుకనుండి కేకలు వేస్తూ వీరు సర్వోన్నతుడైన దేవుని దాసులు వీరు మీకు రక్షణ మార్గాన్ని ప్రచురించువారని దయ్యం పలుకుతుంది. నీవు నడిచే మార్గం దయ్యానికి తెలిసిపోయింది. ఇది రక్షణ మార్గమని నీకు తెలిసిందా? తెలియకుండా ఎలా నడువగలవు? రక్షింపబడిన మనము ప్రభువు ఇచ్చిన గొప్పరక్షణను గుర్తించాలి. నీవు పొందిన రక్షణవిలువను గుర్తించినప్పుడే నీవు నీ రక్షణను కాపాడుకోగలుగుతావు. చాలామందికి రక్షణవిలువ తెలియక రక్షణను నిర్లక్ష్యం చేస్తుంటారు. అందుకే హెబ్రిగ్రంథకర్త అంటున్నాడు. **"ఇంత గొప్పరక్షణను నిర్లక్ష్యము చేసినయెడల ఏలాగు తప్పించుకొందుము? హెబ్రి 2 :3.** ప్రభువు సిలువ త్యాగము ద్వారా ఏర్పరచిన ఈ రక్షణమార్గము ద్వారానే తండ్రియొద్దకు మనం చేరగలుగుతాము. రక్షింపబడినతర్వాత నీవు ఒక ప్రత్యేకమైన వ్యక్తివని నీ మార్గం ప్రత్యేకమైనదని గుర్తించాలి. లోకుల మార్గములో నీవు నడవడానికి వీలులేదు.

**ఐదవదిగా ఈ మార్గము జీవమార్గము." ఈ ప్రజలతో నీవిట్లనుము యెహోవా సెలవిచ్చునదేమనగా జీవమార్గమును మరణ మార్గమును నేను మీ యెదుట పెట్టుచున్నాను". యిర్మియా 21:8**

ఈ మార్గం నీకు జీవాన్ని ఇస్తుంది. అంటే నిన్ను మరణం నుండి తప్పించి, నీ ఆత్మ పాతాళానికి వెళ్లకుండా ఈ మార్గము నీకు జీవాన్ని ప్రసాదించి పరలోక రాజ్యంలో యుగయుగాలు నిన్ను జీవింపజేస్తుంది. ఈ మార్గాలన్ని వేరుకాదు ఒకే ఒక్క మార్గానికి ఇన్ని రకాలైన పేర్లు పెట్టబడినాయి. ఈ మార్గాలలో నడిస్తే నీకు జీవం. యేసయ్య మార్గాలలో నడిస్తే మాకు ప్రయోజనం ఏమి? అనేవారు ఉన్నారు. ఈ మార్గాలలో నడవని అనేకమంది ధనవంతులు కోట్లుకోట్లు ఆస్తులు సంపాదించినవారు అనేకులు చనిపోయారు. వారు ఎక్కడికి వెళ్లారో చనిపోయిన వాళ్లను అడగండి. ఒకవేళ సమాధిలో చచ్చిన శవాన్ని మీరు బ్రతతికించగలిగితే అడగండి, మీరు కోటీశ్వరులు ప్రభువును నమ్ముకోకుండా చనిపోయారు కదా! నీ కోట్ల ఆస్తిని నీ పిల్లలు అనుభవిస్తున్నారు. మరి మీరు ఎక్కడికి వెళ్లారు అని అడిగితే ఈ భూమిమీద కోట్ల కోట్ల ఆస్తులు ఉన్నప్పటికి మేము జీవము కలిగిన యేసుప్రభుమార్గంలో నడవలేదు గనుక మేము నరకములో కాలుతున్నామని అగ్నిలో పడిన ధనవంతుడు కేకలు వేసినట్లుగా వారు కేకలు వేస్తారు.

నీకు జీవము కలిగిన మార్గముకావాలా? లేక మరణానికి తీసుకువెళ్లి ఆత్మను నరకంలో పడవేసే మరణమార్గం కావాలా? అది నీవే నిశ్చయించుకోవాలి. అయితే ఈ మార్గంలో నీవు నడవాలంటే మొదట నిన్ను నీవు ప్రతిష్ఠించుకోవాలి. ప్రతిష్ఠించుకోకుండానే ఈ మార్గంలో నడుస్తున్నావంటే నీవు భ్రమలో ఉన్నావని అర్థం. నీవు ప్రతిష్ఠించుకో, నీ సమయాన్ని ప్రతిష్ఠించుకో, నీ డబ్బును ప్రభుకొరకు ప్రతిష్ఠించు, నీ జ్ఞానమును ప్రభుకొరకు ప్రతిష్ఠించు, నీ యవ్వనాన్ని

ప్రభుకొరకు ప్రతిష్టించు, నీ తలాంతులు ప్రభుకొరకు ప్రతిష్టించు, నీ వరాలు ప్రభుకొరకు ప్రతిష్టించు. ఎంతకాలం అటుఇటు ఊగుతూ తిరుగుతూ ఉంటావు. ఇకనైనా సమయం కొంచెమే ఉందని నీ జీవితంలో నీ అయుష్షు కొద్దికాలమేనని నీవు తెలుసుకొని నీ మనోనేత్రాలు తెరచి ఇప్పటికైనా నీవు ప్రతిష్టించుకొని ఈ ప్రతిష్టకలిగిన మార్గంలో పరిశుద్ధ మార్గములో, రాజ మార్గములో, రక్షణ మార్గములో, జీవపు మార్గములో ఇప్పటికైనా నీవు నడవగలిగితే నీవు గమ్యం చేరుతావు. యుగయుగాలు ఆనందంగా సంతోషంగా ఉంటావు. ప్రతిష్టించుకోకుండా నామకార్థ భక్తిచేస్తూ లోలోపల దైవత్వంలేక ప్రార్థనా అనుభవంలేక పరిశుద్ధజీవితం లేక ఆరాధనలేక, దేవునియందు భయభక్తులు లేక, పైకి క్రైస్తవులమని పేరు ధరించియుంటారు. కొంతమంది క్రైస్తవులు 40 దినాల ఉపవాసాల ప్రార్థనల సమయములో బీరు, బ్రాండి త్రాగరు, సినిమాలు చూడరు, పెళ్లివిందులు చేయరు. 40 దినాల ఉపవాస ప్రార్థనలు ముగించిన తర్వాత ఒక్కవారంలోనే 40 రోజుల్లో చూసే సినిమాలు, త్రాగుడం అన్ని చేస్తుంటారు.

మనం అలాకాదు ప్రతిష్టించుకోవాలి. ఈ లోకానికి మనం ఏమి తీసుకొని రాలేదు. ఏమి తీసుకొని పోము. తల్లిగర్భం నుండి జన్మించి నాలుగురోజులు బ్రతకడానికి నీవు వచ్చావు. నాలుగురోజులతర్వాత నీవారే నిన్ను మరచిపోతారు. నీవు ఏదైనా చరిత్రలో ఏదైనా గొప్పపనిచేస్తే అప్పుడప్పుడు నిన్ను జ్ఞాపకం చేసుకుంటారు. ఆ గొప్పపని కూడా చేయకపోతే నిన్ను జ్ఞాపకం చేసుకునే నాధుడే ఈ భూమిమీద ఉండరు. చివరికి మనం నివసిస్తున్న ఈ భూమికూడా ఉండదు. దేవుడు ఒక్కసారి దీన్ని తీసివేస్తే ఎక్కడికి వెళ్తుందో కూడా అడ్రస్‌లేకుండా కొట్టుకొనిపోతుంది. ఇక్కడ క్రొత్త భూమి, క్రొత్త ఆకాశం, క్రొత్త యెరూషలేము ఉంటుంది. ఆ రాజ్యంలో మనం ఉండడానికే ఈ ప్రతిష్టకలిగిన మార్గములో నడవాలి.

గనుక ఈ ప్రతిష్టకలిగిన మార్గములో, రక్షణమార్గములో, జీవపుమార్గములో, పరిశుద్ధమైన మార్గములో పరిశుద్ధంగా నీవు జీవించి ఎన్ని కష్టాలైనా, ఎన్ని బాధలైనా, ఎన్ని నిందలైనా, అవమానములైనా, శోధనలైనా, శ్రమలైనా నీవు ప్రతిష్టించుకొని నడుస్తున్నావంటే నీ చుట్టూ ఉన్నవారు ఊరుకుంటారా? నిన్ను అవమానిస్తారు, హింసిస్తారు, సూటిపోటిమాటలతో గుచ్చుతారు, నిన్ను ఇంట్లోనుండి వెలివేస్తారు, నీవు ప్రత్యేకంగా యేసుప్రభువును నమ్ముకున్నావు అని నిన్నుచులకనగా చూస్తారు. అవసరమైతే నీవారే నిన్నుతరుమవచ్చు అయినా ఈ ప్రతిష్టితమైన మార్గములోనే మనం ప్రతిష్టించుకొని నడిచి ప్రభువు రాకడకు సిద్ధపడుదుముగాకా. ఆమెన్...


**మీ ప్రార్థనా అవసరతలకొరకు సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు- 08734-240147**

**ఈ పరిచర్య నిమిత్తం కానుకలను, చెక్కులను, డిడిలను ఈ క్రింది అడ్రస్సుకు పంపగలరు.**

M.Jayaraj SBI- Branch: Nirmal A/c No: 31665876753

## “యెహోవాకు అసాధ్యమైనది ఏదైనా నున్నదా?” ఆది18:14

దేవునినమ్మిన ప్రజల జీవితాల్లో ఆయన ఆశ్చర్యకార్యాలను మహత్కార్యాలను జరిగించుకుంటూ వస్తున్నాడు. మన మూలపితరుల యొక్క జీవితాలను లేఖనాల్లో గమనిస్తే ప్రతిఒక్కరి జీవితంలో ఆయన ఎన్నో ఆశ్చర్యకార్యాలను, అద్భుతకార్యాలను అసాధ్యమైనకార్యాలను ఆయన చేసినట్లుగా పరిశుద్ధ గ్రంథంలో చూస్తున్నాము. చాలామంది దేవుని బిడ్డల జీవితాల్లో దేవుడు చేస్తున్న అద్భుతాలను ఆశ్చర్యకార్యాలను వారి జీవితంలో దేవుడు జరిగించిన అద్భుత విషయాలను ఇతరులు చూసి చాలామంది అలాంటి అద్భుతాలు మా జీవితంలో చేస్తే బాగుండును అని ఆశపడ్తుంటారు. లేక తోటివిశ్వాసియొక్క జీవితంలో ప్రభువు చేసిన అద్భుత ఆశ్చర్యకార్యాలను చూసినప్పుడు హృదయంలో కలిగే తలంపులు, ఆలోచన వారిజీవితంలో చేసిన అద్భుత ఆశ్చర్యకార్యాలు నా కుటుంబంలో నా జీవితంలో చేస్తే ఎంతోబాగుండు! అని ఆశకలిగియుంటారు. ఇది సాధారణ విషయమే! నీతోటి సేవకులపట్ల దేవుడు చేసిన ఆశ్చర్యకార్యాలను, అద్భుతాలను చూసినప్పుడు ఆ కార్యాలు నా సేవలో జరగాలి అని అది ఉద్యోగ విషయంలో కావచ్చు, ఆర్థికపరంగా కావచ్చు, లేక యింటివిషయంలో కావచ్చు, లేదా పిల్లల భవిష్యత్ విషయంలో కావచ్చు ఏవిషయంలోనైనా, నీ తోటి వారి పిల్లలు ఎదుగుతూ అభివృద్ధి చెందుతూ వారు మంచి స్థాయికి ఎదిగినవారై ఆత్మీయకంగా జీవిస్తూఉంటే, ఆహా! నా పిల్లల్లో కూడా ఇలాంటి అద్భుతాలు జరిగితే ఎంతబాగుంటుంది, నా పిల్లలు కూడా అలా చదివితే ఎంత బాగుంటుంది, నాపిల్లలుకూడా అలా ఆశీర్వాదాలను అనుభవిస్తే ఎంత బాగుంటుంది అని పిల్లలవిషయంలో, ఉద్యోగాల విషయాల్లోనేమి, పొరుగువారి జీవితాల్లో ప్రభువు చేసినఆశ్చర్యకార్యాలను తలచినప్పుడు మన జీవితంలో జరగాలని ఆశకలిగియుంటాము. ఇది సాధారణంగా ప్రతిఒక్కరికి కలిగే ఆశలు, కోరికలే. అయితే గమనించండి వారిపట్ల అద్భుతాలు జరిగాయి, వారిపట్ల ఆశ్చర్యకార్యాలు జరిగాయి, నా జీవితంలో అలాంటి ఆశ్చర్యకార్యాలు, అద్భుత కార్యాలు దేవుడు చేస్తాడా? నా జీవితంలో అలాంటి అద్భుతమైన కార్యాలను దేవుడు జరిగిస్తాడా? అనే ప్రశ్న చాలామంది హృదయాల్లో ఉద్భవిస్తుంది. చాలామంది సాక్ష్యాలు వింటాము. ఆ సాక్ష్యాలు విన్నప్పుడు ఇది సాధ్యమా? అన్నట్లుగా ఉంటుంది. ఈ అసాధ్యమైనకార్యాన్ని దేవుడు చేస్తాడా? ఇది సాధ్యమేనా? అన్నట్లుగా ఉంటుంది. సరే వారి జీవితాల్లో దేవుడు చేసాడు. నాజీవితంలో చేయగలడా? నా కుటుంబంలో చేయగలడా? అనే ప్రశ్న ప్రతిఒక్కరిలో మెదలుతుంది.

ఒకసారి రష్యాదేశం మిల్టిలో వన్య అనే సహోదరుడు పనిచేస్తున్నాడు. కమ్యునిష్టు సిద్ధాంతంలో పాతుకుపోయిన రష్యా దేశంలో వన్య యేసుప్రభువును నమ్ముకోవడం ఆ దేశానికే కాని వారి సిద్ధాతాలకే కాని మిలటరిఆఫీసువారికైనా ఇష్టంఉండదు. ఈ విషయం తెలిసిన

వెంటనే వన్యను పిలిపించి వన్యతో నీవు ఒక మంచి సైనికుడివి, మనదేశ కట్టుబాట్ల, సిద్ధాంతం ప్రకారంగా దేవుడు లేడు దయ్యము లేదు, కమ్యూనిష్టు సిద్ధాంతం మీద మనదేశం కట్టబడింది. మన దేశప్రజలు ఆ సిద్ధాంతం మీద బ్రతుకుతున్నారు, జీవనాన్ని కొనసాగిస్తున్నారు. నీవు ఎవరినో నమ్ముకొని ప్రార్థన చేస్తున్నావనే సంగతి తోటి సైనికులు తెలిపారు, ఇదివాస్తవమేనా అని వన్యను నిలదీసి అడుగుతున్నారు. అందుకు వన్య వారితో మీరు చెప్పినట్లుగా నేను క్రైస్తవుడను, ఒకప్పుడు నేను కూడ దేవున్ని నమ్మనివాన్ని. కమ్యూనిష్టు సిద్ధంతాలను పూర్తిగా ఆచరించినవాడను, బోధించినవాడను, వాటిప్రకారంగా నిష్టగా జీవించినవాడనే అయితే నేను యేసుప్రభువు దేవుడని లోకానికి రక్షకుడని తెలుసుకున్నాను. అందుకే నేను ప్రార్థనచేస్తున్నాను, బైబిల్ ధ్యానిస్తున్నాను అని తన అధికారికి సమాధానమిచ్చాడు వన్య. దానికి ఆ అధికారి విపరీతమైన కోపముతో, ఆవేశముతో నిండినవాడై ఆయన ఏమన్నాడో తెలుసా ఇది చలికాలం, రష్యాదేశంలో చలికాలం విస్తారమైన మంచు పడుతుంది. ఇండ్లు కూడా మునిగిపోయేంతగా మంచుపడుతుంది. ఆమంచు పడుతున్న సమయాల్లో అతనికి చెప్పాడు ఇదిగో నీవు ఆ యేసుప్రభువును విడిచిపెట్టనియెడల, ప్రార్థన మాననియెడల, బైబిల్ చదవడం మాననియెడల నిన్ను ఈచలిలో రాత్రంతా బయట నిలబెడ్తాము. నీవు 10 నిమిషాలలో మంచుకు గడ్డకట్టుకుపోయి చనిపోతావు జాగ్రత్తా, ఆలోచించి ఏ నిర్ణయం తీసుకుంటావో తీసుకో అనిచెప్పి బయటకు పంపించాడు అధికారి. మళ్లీ గంటతర్వాత అధికారి తనను పిలిచాడు.

నీ నిర్ణయం మారిందా? ఆ యేసుప్రభువును విడిచిపెడ్తావా?, ప్రార్థన మానివేస్తావా? అని అన్నాడు. అప్పుడు వన్య నా ముక్కులో శ్వాస ఉన్నంతవరకు నేను యేసుప్రభువును విడిచిపెట్టలేను, ప్రార్థనను నేను మానలేను, నేను మంచి క్రైస్తవునిగా జీవించి క్రైస్తవునిగా మరణించాలని అనుకుంటున్నాను. కాబట్టి నాకు మరణభయం లేదు అనిసూటిగా అధికారికి సమాధానమిచ్చాడు. ఆ అధికారి ఇంకా కోపంతెచ్చుకొని సాయంకాలం అయినప్పుడు ఆర్మీవారికి బట్టలు ఇచ్చే అధికారికి ఒక లేటర్ వ్రాసాడు. వన్యకు వెచ్చదనం కలిగించే బట్టలు ఇవ్వకూడదు. ఎండకాలం వేసుకునే పలుచని వస్త్రాలను అతనికి ఇచ్చి సాయంత్రం 6 గం॥లకు అతనిని బయట మంచులో నిలబెట్టాలి అని ఆజ్ఞాజారిచేసాడు అధికారి. వెంటనే వన్యకు పలుచని వస్త్రాలను తొడిగించి అతన్ని సాయంత్రం 6 గం॥లకు మంచులో నిలబెట్టారు. అప్పటికే మంచు పడడంప్రారంభమైనది. మంచుపడుతున్నది చిన్నచిన్నగా వర్షం పడుతున్నట్లుగా మంచు పడుతుంది. అలా భూమిమీద పేరుకుంటూ పేరుకుంటూ కుప్పగా పైకివస్తుంది. ఆ మంచులో వన్యను నిలబెట్టారు. 6గం॥లకు నిలబెట్టారు 7 అయ్యింది 9 అయ్యింది అప్పుడు ఆ అధికారి వెచ్చని పెద్దకోటును ధరించి, పాదాలకు సాక్సులు వేసుకొని అన్ని ఉన్నా చలిలో వణుకుతూ వన్య నిలబడ్డస్థలానికి వచ్చాడు. నీ నిర్ణయం మారిందా? అని అడుగుతున్నాడు. అంతకుముందు వన్య 6గం॥లకు నిలబడినప్పటునుండి అతని శరీరమంతా చల్లగా అయిపోయింది. అయితే గమనించండి వన్య ఒక ప్రార్థన చేసుకున్నాడు. ప్రభువా నీ చిత్తంలేకుండా నా జీవితంలో ఏది

జరగకూడదు. ఇదిగో ఈ సమయంలో మంచులో నిలబడ్డాను నీవు నన్ను కాపాడినట్లయితే బ్రతుకుతాను బ్రతికితే నీ సాక్షిగా ఉంటాను. చనిపోతే నీ దగ్గరకు వస్తాను. బ్రతుకుట క్రీస్తే చావైతే మేలే అని చెప్పి ప్రార్థన చేసుకున్నవాడై నిలబడ్డాడు. 9గం॥లు అయినా అతను మంచులో గడ్డకట్టిపోకుండా, వణకకుండా అలాగే మంచులో నిలబడ్డాడు. ఆ సమయంలో వెచ్చని స్వెటర్ వేసుకున్న అధికారి మాత్రము వణుకుతూ వచ్చాడు. ఆ అధికారి వన్యతో అంటాడు నీవు మనిషివేనా? ఇంతసేపు మంచులో ఎలా ఉండగలిగినావు? వన్య నిర్ణయం మార్చుకో ఇంకా విపరీతమైన మంచుపడే సమయం ఆసన్నమవుతుంది. నీవు మంచులో కూరుకుపోతావు వన్య నిర్ణయం మార్చుకో లోపలికిరా. అందుకు వన్య నా నిర్ణయం మారదు సార్.

ఇదికథ కాదు జరిగిన వాస్తవం. నా విశ్వాస జీవితాన్ని బలపరచిన సాక్ష్యపుస్తకం నా విశ్వాసాన్ని నిబ్బరపరచి, ధైర్యవంతునిగా నిలబడడానికి విశ్వాస వీరునిగా మారడానికి దేవుడు నాకు చూపించిచదువుమని చెప్పిన పుస్తకాలు ఇవి. ఇవి సజీవసాక్ష్యాలు. కోపంతో అధికారి లోపలికి వెళ్లాడు. చుట్టూఉన్నా ఆసైనికులు వారి గదులలోనుండి కిటికీలలోనుండి వన్య చనిపోయాడాలేదా అని చూస్తున్నారు. లోపల రూంలో ఉన్నవారంతా వణికిపోతున్నారు వన్య మంచులో నిలబడ్డాడు. కొంతమంది బాధపడ్తున్నారు. కొంతమంది దేవుడు దేవుడు అంటూ నిలబడ్డాడుకదా వినికేమి కర్మ వీడు చచ్చిపోతాడు పోని అని అనుకుంటున్నారు.

విస్తారమైన మంచుపడుతున్న 12 గం॥ల సమయంలో మళ్లీ అధికారి వన్య దగ్గరకు విపరీతమైన చలికి గడగడవణుకుతూ వచ్చాడు. వన్య బ్రతికి ఉన్నావా గడ్డకట్టుకుపోయావా? అని అన్నాడు. రాగానే సెల్యూట్ చేసాడు వన్య. ఆధికారి అంటాడు వన్య ఇంతవరకు బ్రతికి ఉన్నావా? అవును నా దేవుడు నన్ను బ్రతికించుటకు సమర్థుడు. క్షణంలో గడ్డకట్టవలసిన ఈ మంచులో చనిపోవలసిన నీవు ఎలా ఉండగలుగుతున్నావు? ఇకనైనా నీ నిర్ణయం మారితే నీవు బ్రతుకుతావు లేదా చనిపోతావు అని కఠినముగా చెప్పి అధికారి లోపలికి వెళ్లిపోయాడు.

ఉదయం 6గం॥లకు వన్య సజీవులలెక్కలో ఉన్నాడు. ఇది సాధ్యమా అని సైనికులు అంటున్నారు, పలుచని వస్త్రాలను ఇచ్చిన అతను అంటున్నాడు ఇది ఎలా సాధ్యం? ఇది అసాధ్యం వన్య గడ్డకట్టకుండా చనిపోకుండా రాత్రంతా మంచులో నిలబడి ఉండడం ఇది అసాధ్యమైన పని ఎలా ఉండగలిగావు? అప్పుడు ఆ మిలటరిలో ఒక మాట వన్యదేవుడు నిజమైన దేవుడు ఆయన అసాధ్యమైన కార్యములను చేయడానికి సమర్థుడు. వన్యదేవుడు నిజమైన దేవుడని అతనిని యేసుప్రభువు అనిపిలుస్తారని ఆయన సర్వలోకానికి దేవుడని నిజంగా వన్య జీవితంలో అద్భుతం చేసిన దేవుడు గొప్పదేవుడే అని అందరు మాట్లాడుతున్నారు. అధికారికి ఏమి అర్థంకాక నీవు గదికి వెళ్లిపో వన్య అని చెప్పి పంపించాడు. గదికి వెళ్లినతర్వాత తన తోటి సైనికులంతా తన దగ్గరకు వచ్చి వన్య ఎలా నీవు అంతసేపు మంచులో ఉండగలిగినావు? సైన్సును నమ్ముకున్నాము, సైన్సుప్రకారంగా చనిపోవలసిన నీవు ఎలా బ్రతుకగలిగావు? ఇది అసాధ్యమైన పని ఎలా జరిగింది? అని వన్య ద్వారా సువార్తను విన్నారు.

ఈలాంటి సాక్ష్యాలు మనం విన్నప్పుడు ఈలాంటి అద్భుతం దేవుడు నా జీవితంలో చేస్తే ఎంతబాగుండును అని అనుకుంటాము. విధవరాలి ఇంటిలో పట్టెడు పిండి బుడ్డిలో కొద్దినూనే ఇలాంటి అద్భుతం ఇది సాధ్యమైనది కాదు. మరి ఎలా సాధ్యమైందని అనిపిస్తుంది.

ఇద్దరు కుమారులు ఉన్న విధవరాలు తమ దైవజనునిదగ్గరకు వెళ్లితే కుండలు అన్ని తెచ్చిపెట్టి నీ దగ్గర ఉన్న కొద్దినూనె వాటిలో కొద్దికొద్దిగా పోయి దేవుడు అద్భుతం చేస్తాడు అని సేవకుడు చెప్పిన మాటనునమ్మి వెళ్లి ఇంటిలో దైవజనుడు చెప్పినట్లుగానే కుండలన్నిటిలో కొద్ది కొద్దిగా నూనెపోసింది కుండలు అన్ని నూనెతో నిండిపోయాయి. ఈ విషయాన్ని దైవజనునికి చెప్పగానే దైవజనుడు ఆ నూనెను అమ్మి వచ్చిన డబ్బులతో నీ అప్పులు తీర్చుకో అని చెప్పాడు. అలా మార్కెట్‌కువెళ్లి ఆ నూనెను అంతా అమ్మి అప్పంతా కట్టేసింది. మిగిలిన డబ్బులతో వారు సంతోషంగా జీవించారు. అప్పులతో బాధపడ్తున్నవారికి ఏమి అనిపిస్తుంది? దేవుడు అద్భుతం చేసి ఆమె నూనె కుండలు నింపి ఆమె అప్పంతా దేవుడు తీర్చేసాడు. అలా అద్భుతం నాజీవితములో చేసి నా అప్పులు ఇలా తీరిపోతే ఎంతబాగుంటుంది అని అనుకుంటారు. బైబిల్‌లో జరిగిన అద్భుతాలు నా జీవితములో జరుగుతాయా? ఇరుగుపొరుగు వారి జీవితాల్లో దేవుడు చేసిన అద్భుతాలు నా జీవితంలో జరుగుతాయా?

గమనించండి దేవునిబిడ్డలారా, మన జీవితంలో ఆశ్చర్యకార్యాలు అద్భుత కార్యాలు దేవుడు చేయడానికి సమర్థుడు. ఇలాంటి అద్భుతాలు నా జీవితంలో జరుగుతాయోలేవో అని అనుకుంటున్నావు కదా వారిజీవితాల్లో అద్భుతాలు చేసిన దేవుడు నీ జీవితంలోకూడ అద్భుతాలు చేయగలడు. వారిజీవితములో ఆశ్చర్యకార్యాలను చేసిన దేవుడు వారి జీవితాన్ని విప్లవాత్మకంగా మార్చిన దేవుడు మీ కుటుంబములో మీ జీవితములో కూడా అలాంటి అద్భుతాలు ఆశ్చర్యకార్యాలు చేయగలను అని ప్రభువు చెప్పుచున్నాడు. ప్రభువు విశ్వసించిన బిడ్డలజీవితములో సమస్తాన్ని సాధ్యపరిచే దేవుడు ఆయన. ఆయనయందు విశ్వాసముంచితే ఈ లోకములో ఉన్నవారు మోసము చేయవచ్చుకాని ఆకాశమందు ఉన్న దేవుడు తనను ఎవరైతే హృదయమందు స్థాపించుకుంటారో, వారి జీవితాల్లో అద్భుతాలుచేసి, వారి కుటుంబాలను విప్లవాత్మకంగా మార్చగలడు.

ఒక వ్యక్తికి పుట్టుకతోనే కాలు లేవు. ఒక పాస్టర్‌గారు ప్రార్థన చేసి మార్కెట్‌కి వెళ్లి చెప్పులు కొనుక్కోమని చెప్పారు. ఇతనికి కాళ్లేలేవు చెప్పులు ఏమి చేసుకోవాలనే సందేహం వచ్చింది. కాని విశ్వాసం ఉంది అద్భుతాలు జరగడం చూసాడు. తనకివ్వబడిన రిక్షాపై పోతున్నాడు మొత్తానికి ఆయన చెప్పుల దుకాణానికి వచ్చేసరికి తను ఉన్న రిక్షాలోనే మొదటఉన్న తనకాలితో రెండవ కాలు కూడా సమానంగా పెరిగిపోయింది. చూసిన వారంతా ఇది సాధ్యమా అని అన్నారు, ఆశ్చర్యపోయారు, ఇది డాక్టర్లకు సాధ్యము కానిది కాని దేవునికి సమస్తము సాధ్యము. నీవు ఏది అసాధ్యమని అనుకుంటున్నావో నీ జీవితములో అసాధ్యమైనవాటిని సాధ్య పరిచే దేవుడు ఆయన పేరు నజరేయుడైన యేసు. ఆయన నిన్న

నేడు ఏకరీతిగా ఉన్నాడు మార్పులేనివాడు మారనివాడు ఏకరీతిగా ఉన్నవాడు. ఆయన మాటఅంటే మాటే. ఒకసారి బైబిల్‌లో జరిగిన సంగతిని జ్ఞాపకం చేసుకుందాము. దేవుడు అబ్రహాముతో మళ్లివచ్చే సంవత్సరములో నీ భార్య గర్భవతియై కుమారున్ని కంటుందని చెప్పాడు. ఆ మాట దేవుడు అబ్రహాముతో అంటే గుడారములో ఉన్న భార్యయైన శారా మాట విని నవ్వింది. తాను ఇది పెద్దజోక్ అని అనుకున్నది. దేవుడు జోక్ చేస్తాడా? నవ్వు ఎప్పుడు వస్తుంది. జోక్ చేసినప్పుడే కదా. శారమ్మ దేవుడు జోక్ చేసినట్లుగా నవ్వింది. శారా నవ్వగానే సర్వాన్ని సృష్టించిన దేవుడు ఆమె గుడారములో నవ్వడం బయట ఉన్న దేవుడు గమనించి శారా నీవు నవ్వనేల? యెహోవాకు అసాధ్యమైనది ఏదైన ఉన్నదా? అని అడిగినప్పుడు నేను నవ్వలేదు అని చెప్పింది. అసలు ఎందుకు నవ్వింది? నవ్వడానికి కారణాలు కూడా ఉన్నాయి. అప్పటికే నడుమువంగిపోయి నడుస్తుంది.

ఇప్పుడు నిండువృద్ధాప్యంలో ఉన్న ముసలివారితో అమ్మానీకు కుమారుడు జన్మిస్తాడని చెప్పితే పిచ్చివాడిని చూచినట్లు తిరిగి చూడరా! శారాకు స్త్రీధర్మము ఉడిగిపోయింది. అలాంటి ఆమెతో దేవుడు మరుసటి సం॥ నీ భార్యయైన శారా కౌగిలిలో బాబు ఉంటాడు అని చెప్పగానే బాధను తీసివేయడానికి దేవుడు పెద్ద జోకువేసాడు అని అనుకొని ఉండవచ్చు శారమ్మ. నా బాధ మర్చిపోడానికి దేవుడే జోక్ చేసాడని శార నవ్వుతుంది.

ప్రియమైన దైవజనాంగమా, గుండెలో బాధఉన్నవారికి జోక్ చేసే దేవుడు కాదు ఆయన. గుండెనిండారా బాధపెట్టుకొని ఉన్న శారాతో జోక్ చేయలేదు కాని గుండెల్లో బాధతో ఉన్న శారా ఆ బాధ మరచిపోయి నవ్వింది. అసాధ్యమైనదేదియు లేదని దేవుడు చెప్పిపోయిన తర్వాత వంగిపోయిన నడుము లేచి నిలబడింది. మరల తనకు స్త్రీధర్మము వచ్చింది. దినములు నిండుతున్న కొద్ది శారా గర్భములో కుమారుడు ఎదుగుతూ ఉన్నాడు. తొమ్మిది నెలలు వచ్చాయి శారాకు ప్రసవవేధన వచ్చింది. మొత్తానికి కుమారుడు జన్మించాడు. శారాకు కుమారుడు జన్మించాడని అందరికి తెలిసిపోయింది. ఇక అందరు నవ్వుతున్నారు గనుక పుట్టిన కుమారునికి ఇస్సాకు అనగా నవ్వు అని నామకరణం చేసారు. శారా ఇన్ని దినములు ఏడ్చావుకదా ఇక నీవు నీ జీవితమంతా నవ్వుతూనే ఉండూ ఎందుకో తెలుసా? నీ జీవితములో అసాధ్యమైన కార్యాన్ని నేను సాధ్యం చేశాను. అసాధ్యాన్ని దేవుడు సాధ్యం చేస్తాడు.

ఈ భూమిమీద దేవుని మించిన వారు ఎవరైనా ఉన్నారా? పరలోకంలో దేవుని మించినవారు ఎవరైనా ఉన్నారా?ఎక్కడాకూడా లేరు. ఈ రోజు మనము ఆరాధిస్తున్న దేవుడు సాధ్యపరచువాడు కాడా? ఆయనకు సాధ్యం కాకుండా ఏదైనా ఉన్నదా? ఆ మహోన్నతుడైన దేవుడే, సర్వశక్తిగల దేవుడే మన గుండెల్లో నివాసం ఉన్నాడు. నీ గుండెల్లో నివాసం ఉన్న నీ దేవునికి అసాధ్యమైనది ఏమి లేదు. కొంతమంది హృదయంలో దేవుడు లేడుకానివారి హృదయం బయట ఉన్నాడు. దేవుడు హృదయం బయట ఉన్నవారి జీవితాల్లో ఎలాంటి అద్భుతాలు చేయలేడు కాని ఎవరి హృదయంలో యేసు ఉంటాడో వారిజీవితాల్లో అద్భుతాలు చేస్తాడు.

నీకు ఎక్కడ వ్యాధికలిగినది? ఎక్కడ క్యాన్సర్ వ్యాధి వచ్చింది? ఎక్కడ నీ అవయవాలు పాడైనాయి? నీ హృదయములో ఎవరు ఉన్నారు? యేసుఉన్నాడుగదా! క్యాన్సర్ గొప్పదా నీ దేవుడు గొప్పవాడా? నీ హృదయంలో ఉన్న దేవుడు ఆ వ్యాధితో నేను హృదయంలో ఉన్నాను. నీవు బయటకువెళ్లిపో అని గద్దించి నిన్ను ఆరోగ్యవంతునిగా చేస్తాడు. యేసయ్య ఎవరి హృదయంలో స్థాపించబడతాడో వారి హృదయంలో భయమేలేదు.

షద్రక్, మెషెక్, అబద్నెగో రాజుతో రాజా! నీవు నిర్మించినా ఈ ప్రతిమకు మేము నమస్కారము చేయము. రాజు సైనికులతో అగ్ని ఏడంతలు చేసి మంటను పెంచండి. వీరిని అందులో పడేసి కాల్చివేయాలని రాజు ఆజ్ఞ జారిచేసాడు. ఇదిగో ఆ మంట చూసారా? నా ప్రతిమను నమస్కరించనియెడల కాలిపోతారు. అందుకు వారు రాజా నీ అగ్ని ఏడంతలు పెరిగినా మేము మాత్రం ఆ ప్రతిమకు నమస్కారము చేయము అనిచెప్పారు. ఎక్కడిది ఈ ధైర్యం. వారి హృదయములో స్థాపించబడిన యేసు ఉన్నాడు. హృదయములో ఉన్న యేసు వారికి ధైర్యము ఇచ్చాడు. వారు రాజా నీ ప్రతిమకు మేము నమస్కారము చేయము. ఆ అగ్నికి మేము భయపడము అని సమాధానమిచ్చారు. రాజు వారిని కట్టివేసి అగ్నిలో పడవేయండి అని చెప్పాడు. వారిని కట్టి పడవేసినవారు అగ్ని వేడిమికి కాలిపోయారు. లోపల పడద్రోయబడ్డా షద్రక్, మెషెక్, అబద్నెగో వీరు సజీవులుగా తిరుగుతున్నారు. ప్రభువు నీ హృదయములో స్థాపించబడినతర్వాత ఇక నీవు భయపడవలసిన అవసరమే లేదు.

ప్రియమైన దైవజనాంగమా, మారా అనుభవాన్ని మధురంగా మార్చగలదేవుడు. నీ కోసం దేవుడు బండను పగలగొట్టి నీళ్లు ఇచ్చి దాహం తీరుస్తాడు. నీకోసం ఇంకా ఏమిచేయమంటావు? సముద్రాన్ని పాయలు చేయమంటావా? మన్నాను కురిపించమంటావా? యెరికోను కూల్చమంటావా? యొర్దాను చీల్చమంటావా? ఫరో కుమారున్ని చంపమంటావా? నీకొరకు శత్రుసైన్యాన్ని నీటిలో ముంచమంటావా? ఐగుప్తులో ఉన్న జేష్ఠ సంతానాన్ని తన ప్రజలైన ఇశ్రాయేలీయులకొరకు చంపలేదా? నీ కొరకు శత్రుబలమంతటిని అణచివేస్తాడు. తన ప్రజలకొరకు ఎన్నో అద్భుతాలు చేసాడు. ఇదంతా తన ప్రజలైనా ఇశ్రాయేలీయులకొరకు దేవుడు చేసాడు. నీ కోసం కూడా దేవుడు చేస్తాడు.
ప్రకటన గ్రంధంలో నేను మొదటివాడను కడపటివాడను, నేను మార్పులేనివాడను యుగయుగాలు జీవించువాడను. మార్పలేనివాడు అనగా ఆరోజు ఎలా ఉన్నాడో ఈరోజు కూడా అలాగే ఉన్నాడు. ఈ జీవిత యాత్రలో పోరాటాలన్నిటిని సాధ్యపరిచే దేవుడు నీకు తోడుగా ఉన్నాడు గనుక భయపడవద్దు.

ఎస్తేరు అనే రాణీ గురించి పరిశుద్ధగ్రంథంలో వ్రాయబడిఉంది. ఆమె ఒక దాసత్వములో ఉన్న అమ్మాయి. ఎన్నికలేని అమ్మాయి. తన చిన్నాన్నయైన మోర్దెకై ఆమెను పెంచుతున్నాడు.తనకు తల్లిదండ్రులు లేరు. 120 సంస్థానాలకు మహారాజుగా చక్రవర్తిగా ఉన్న అహష్వేరోషుకు భార్యగా మారిపోయింది. ఆ చక్రవర్తి ఇంటిలో వంటసామాగ్రికూడా కడగడానికి, ఊడ్వడానికి, కోటలో ప్రవేశించడానికి కూడా అర్హతలేని ఎస్తేరు వివాహం చేసుకోడానికి ఏ క్వాలిఫికేషన్స్ ఎస్తేరుకు

లేవు. అయోగ్యురాలైన ఆ కన్యక మహారాజు భార్యగా మారిపోయింది. ఎస్తేరు పుట్టినది మొదలుకొని ఒక్కసారి కూడా నేను రాణిని అవుతానని కల గనలేదు. ఆమె జీవితాన్ని అద్భుతంగా మార్చాడు. అసాధ్యమైన కార్యాన్ని ఆమె జీవితములో సాధ్యం చేసాడు.

ఇంకో విషయము అప్పటికే భర్త చనిపోయాడు దిక్కుతోచని స్థితి. తాను ఒక ధనవంతునికి భార్యగా మారుతానని కలలోకూడా అనుకోలేదు. తనసంతానములో దావీదు పుట్టాడు, దావీదు వంశావళిలో లోకరక్షకుడైన యేసుప్రభువు జన్మించాడు. ఇంతటి బాగ్యం కలుగుతుందని ఈమే కలలోకూడా ఊహించలేదు. దేవుడు మీ జీవితంలో కూడా మరచిపోలేని అనుభవాలను చేయగలడు. ఈ లోకంలో జరుగుతున్న భయంకరమైన కార్యాలకు మీరు ఏమాత్రం భయపడకూడదు. కారణం మీలో ఉన్నవాడు లోకములో ఉన్నవానికంటే గొప్పవాడు. లోకంలో ఉన్నవానికంటే మన యేసు గొప్పవాడు. విశ్వాసాన్ని స్థిరపరచుకొని, గుండెనిబ్బరముతో, లోకంలో ఎన్ని శ్రమలువచ్చినా, బాధలువచ్చినా, నిందలువచ్చినా, అవమానాలు వచ్చినా, పోరాటాలు వచ్చినా, స్నేహితులే నీకు వెన్నుపోటు పొడచినా, కన్నవారే నిన్ను త్రోసివేసినా, నా అన్నవారే నీకు దూరమైన ఏదిఏమైనా ప్రభువు నీ గుండెల్లో ఉంటే నీకు అసాధ్యమైనది ఏదిలేదు.

క్రొత్తగా ప్రభువును నమ్మిన ఒకబ్రదర్ ప్రార్ధనా చేయించడానికి 15 నూనె బాటిల్స్‌ని తెచ్చాడు. నేను అడిగాను నీవు వీటిని ఎవరికైనా పంచుతావా? అని అడిగితే అతను లేదు పాస్టర్‌గారు నేను 10 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాను. అయితే పొలమంతా వర్షం పడక రోగమొచ్చి పంట చేతికి రాకుండా అవుతుంది. ఒకవేళ అది నష్టమైతే నా పరిస్థితి అంతా అప్పులపాలై నేను భయంకరమైన పరిస్థితికి వెల్లవలసి వస్తుంది. నా సహోదరుడు చెప్పాడు పాస్టర్‌గారితో ప్రార్ధన చేయించుకొని వీటిని పొలానికి చల్లుమని చెప్పాడు. అందుకే ప్రార్ధనాసహాయం కొరకు వచ్చాను అని చెప్పాడు. కాబట్టి నాకు ప్రార్ధన చేయండి అని చెప్పాడు. ప్రార్ధన చేయగానే తన పొలానికి వెళ్ళి ప్రార్ధన చేసినతైలాన్ని పొలంలో చల్లి, ఒడ్డుమీద ఉండి ప్రార్ధన చేసి ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన తర్వాత తన పది ఎకరాల పొలంమట్టుకు మాత్రమే వర్షం పడింది. తనపంట చేతికి వచ్చింది. ప్రక్కవారు నీ పొలం మీదనే వర్షంపడింది. మా పొలం మీద ఎందుకు వర్షం పడలేదు? ఏమిచేసినావు? అని అంటే నేను ఏమిచేయలేదు యేసయ్యకు ప్రార్ధన చేసాను అంతే వర్షం పడిందని చెప్పాడు.

మన దేవునికి సమస్తమును సాధ్యమే. నీ జీవితములో సమస్తం చేయడానికి సమర్ధుడు, శక్తిమంతుడు, మారనివాడు, మార్పుచెందనివాడు యేసుప్రభువు. శరీరానికి వచ్చిన ఏరోగానికి భయపడకండి. ఏది మిమ్మల్ని ఏమిచేయలేదు. ఉన్నతమైన శక్తి, సామర్ధ్యం కలిగిన దేవుడు నీ గుండెల్లో ఉన్నాడు. లేనియెడల రమ్మని ఆహ్వానించు. ప్రభువా నా హృదయములో నివసించు. అసాధ్యమైన కార్యములను సాధ్యము చేయుమని అడుగు చేస్తాడు. దేవుని అద్భుతాలను కళ్లారా చూస్తావు. దేవుడు మిమ్ములను దీవించునుగాక. ఆమెన్...

Regd. of Newspaper of India
TELTEL/2015/60909

Regd. No. ADB/012/2012-14
License to post on concessional rates

Printed matter

To,

# నిస్సీ మినిస్ట్రీస్

శాస్త్రీనగర్, నిర్మల్, ఆదిలాబాద్ 504106

ఫోన్ : 08734-240147, 9390011485

Website: www. nissi ministries.org

Email ID: nissi.ministries@yahoo.com

Published By: M. Priyadarshini W/o M. jayaraj, H.No. 1-3-132/A6
Shastrinagar, Nirmal, Adilabad Dist. Pin: 504 106

Edited Printed & Owned by: Pastor. M. Jayaraj, H.No. 1-3-132/A6
Shastrinagar, Nirmal, Adilabad Dist. Pin: 504 106